హైవే.. నో వే

- నల్లజర్ల నుంచి దూబచర్ల 7 కిలోమీటర్లు
- జాతీయ రహదారిపై ఒక్క అండర్ పాస్ కూడా లేదు
- పుల్లలపాడు వద్ద తరచూ దుర్ఘటనలు
- రెండు గ్రామాల ప్రజలకు తీరని ఇబ్బంది



తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశం ఇదే..

నల్లజర్ల: అది 16వ నంబర్ జాతీయ రహదారి. విశాలమైన మార్గం కావడంతో గంటకు 100 నుంచి 140 కిలోమీటర్ల వేగంతో వాహనాలు తిరుగుతుంటాయి. ఇంతవరకూ బాగానే ఉన్నా రహదారి నిర్మాణ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఫలితంగా మండలంలోని పుల్లలపాడు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరెందరో క్షతగాత్రులవుతున్నారు. ప్రమాదాల నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కూడా ఇంతవరకూ పెద్దగా ఫలితాలు ఇవ్వడం లేదు.

ఉత్తరాన గ్రామాలు.. దక్షిణాన పొలాలు

మండల కేంద్రమైన నల్లజర్ల నుంచి దూబచర్ల గ్రామం వరకు 7 కిలోమీటర్ల దూరం. ఈ మార్గంలో ఎక్కడా జాతీయ రహదారిపై అండర్ పాస్ లేదు. మధ్యలో పుల్లలపాడు, ముసుళ్లగుంట గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలు జాతీయ రహదారికి ఉత్తరం వైపున ఉంటే ఆ గ్రామ రైతుల పొలాలన్నీ దక్షిణం వైపున ఉన్నాయి. రైతులు ఉదయం, సాయంత్రం పొలాలకు వెళ్లి పాలు తెచ్చుకోవాలన్నా, పనులకు వెళ్లాలన్నా నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో గ్రామస్తుల ఆందోళన మేరకు పుల్లలపాడు వద్ద డివైడర్ కట్ చేసి కొద్దిమేర మార్గాన్ని ఏర్పాటు చేశారు. అదే ఇపుడు గ్రామస్తులు, ప్రయాణికుల పాలిట మృత్యువుగా మారింది. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా పహరా, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి హైవే పెట్రోలింగ్ సిబ్బంది గస్తీ తిరుగుతున్నారు. అయినప్పటికీ ప్రమాదాలకు అడ్డుకట్ట మాత్రం వేయలేకపోతున్నారు.

అసలు సమస్య..

గ్రామాల మీదుగా జాతీయ రహదారి వేసేటపుడు స్థానికుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలి. పుల్లలపాడు వద్ద ఇది ఏర్పాటు చేయలేదు. పుల్లలపాడు, ముసళ్లకుంట గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం జాతీయ రహదారిని క్రాస్ చేయాల్సిందే. చుట్టూ తిరిగి రాలేక ఇక్కడి వాహనదారులు సైతం రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. అతి వేగంగా దూబచర్ల వైపు నుంచి వచ్చే వాహనాల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం దూబచర్ల గాంధీ కాలనీకి చెందిన బోడిగడ్ల రాహుల్ (23) ఇదే ప్రాంతంలో ప్రమాదానికి గురై దుర్మరణం చెందాడు.

డివైడర్ కటింగ్ మూసేస్తేనే మంచిది



రహదారి నిర్మాణ సమయంలోనే ఇక్కడ అండర్ పాస్ ఏర్పాటు చేయాలని ఆందోళన చేశాం. రైతులు, వ్యవసాయ కూలీలు నిత్యం హైవే దాటి వెళ్ళాల్సి ఉంది. దగ్గర మార్గం అని డివైడర్ కటింగ్ ప్రాంతం నుంచి వెళ్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉంది. దీనిని మూసేస్తే మంచిది. జాతీయ రహదారుల అభివృద్ధి, ప్రాధికార సంస్థ అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– వేగి ప్రతాప్, ఎంపీటీసీ సభ్యుడు, పుల్లలపాడు

ఇబ్బందికరంగా ఉంది



కొత్త రహదారి ఏర్పాటు తర్వాత ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల వారే ఈ ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. సంబంధిత అధికారులు పునరాలోచన చేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి.

– డాక్టరు అల్లూరి సూర్యచంద్రరావు, సర్పంచ్, పుల్లలపాడు

చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్



ఉండ్రాజవరం మండలం పాలంగిలో పిల్లలకు టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అనంతపల్లి సర్పంచ్ వెంగల కమలకుమారి అన్నారు. కోరింత దగ్గు, ధనుర్వాతం, డిఫ్తీరియా వంటి ఐదు రకాల వ్యాధులు రాకుండా గర్భిణులు, చిన్నారులకు మంగళవారం టీకాలు వేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనంతపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యడ్లపల్లి మూర్తి, గ్రామపెద్ద బంక అప్పారావు, ఎంపీహెచ్‌ఓ వాసవి,ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని మండలంలో పాలంగి పంచాయతీ కార్యాలయం సర్పంచ్ బి.శ్రీనివాసు మంగళవారం ప్రారంభించారు. పలువురికి టీకాలు వేశారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 12 వరకు మండలంలో ఇంతవరకూ వ్యాక్సిన్ వేయించుకోని ఐదేళ్ల లోపు పిల్లలు, గర్భిణులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, ఆరోగ్య పర్యవేక్షకులు జున్నూరి శ్రీనివాసు,

క్లుప్తంగా

రైస్ మిల్లును పరిశీలించిన డీఎల్‌డీఓ



రైస్ మిల్లులో పోషక బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శాంతామణి

దేవరపల్లి: కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు దేవరపల్లిలోని వేంకటేశ్వర రైస్ మిల్లును మంగళవారం కొవ్వూరు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) వి. శాంతామణి పరిశీలించారు.మిల్లింగ్ సామర్థ్యం, స్టోరేజీ సామర్థ్యం, బియ్యం నాణ్యత, ఫోర్టిఫైడ్ బియ్యం వివరాలను మిల్లు యజమాని సీహెచ్ కాశీనాథస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి పోషక బియ్యపు గింజలను ఆమె పరిశీలించారు. క్వింటాల్‌కు 1 కిలో పోషక బియ్యపు గింజలు కలిపి రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్నట్టు ఆమె తెలిపారు. మిల్లు బియ్యం తయారీ సామర్థ్యం గంటకు 3.50 మెట్రిక్ టన్నుల ఉందన్నారు. డివిజన్‌లోని అన్ని రైస్ మిల్లులను సందర్శించి వివరాలను నమోదు చేస్తున్నట్టు శాంతామణి చెప్పారు. ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, డీఎల్‌డీఓ వెంట ఉన్నారు.

150 మంది విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ



విద్యార్థినికి బస్ పాస్ అందిస్తున్న పోతవరం సర్పంచ్ లక్ష్మణరావు, హరేరామకృష్ణ

నల్లజర్ల: పోతవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల్లో 150 మందికి ఆ పంచాయతీ సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు మంగళవారం ఉచితంగా బస్ పాస్‌లు అందించారు. ఇందుకైన ఖర్చును తానే భరిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు గోపి గోవర్ధన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టరు రాజశేఖర్, తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో పీఆర్వో డి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల గుర్తింపునకు సర్వే

నల్లజర్ల: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలు, కళాశాలలకు వెళుతున్నారా? లేదా అని తెలుసుకునేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ-1 వై.సత్యనారాయణ తెలిపారు. 5-18 సంవత్సరాల మధ్య వయసు బాలబాలికలు విధిగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నమోదై ఉండాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి ఆ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎంఈఓ సత్యనారాయణ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సంక్షేమ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహించి అమల్లోకి వస్తున్న జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో)సాధించాలనిసూచించారు.

దోమల నివారణ అందరి బాధ్యత



దోమల నివారణపై మాట్లాడుతున్న పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖరం

నల్లజర్ల: దోమల నివారణ అందరి బాధ్యత అని గుర్తించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. కీటక జనిత వ్యాధులు, ముందస్తు కీటక నియంత్రణ చర్యలపై మంగళవారం పోతవరం పీహెచ్‌సీలో డాక్టర్ రాజశేఖర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యఆరోగ్యశాఖ, గ్రామ పంచాయతీ సంయుక్తంగా ప్రజారోగ్యం కాపాడదాం అని కోరారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి దోమలు ఉండే ప్రదేశాలను గ్రామస్తులకు చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, సొసైటీ అధ్యక్షుడు పెండ్యాల హరేరామకృష్ణ, పీహెచ్‌ఎన్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు: మండలంలోని వేములూరుకు చెందిన బర్ల అప్పన్న అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. చాగల్లుకు చెందిన మాసా ఆనంద్ అనే వ్యక్తిని మంగళవారం ఇనుప గొట్టంతో కొట్టి గాయపరిచినందుకు అప్పన్నపై ఈ కేసు నమోదు చేశారు. కూలి పనుల నిమిత్తం వేములూరు వచ్చిన ఆనంద్ మంగళవారం అప్పన్న ఇంటి వద్ద ఉన్న మందార పూలు కోస్తుండగా అప్పన్న దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు



ముక్కామలలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ముక్కామలలో గడప గడపకూ..

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఎవరు అడ్డు వచ్చినా సహించేది లేదని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని ముక్కామల గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని వెంట ఉన్న అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. అయితే దిక్కుతోచని ప్రతి పక్షాలు మాత్రం కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. ముక్కామల గ్రామాభివృద్ధికి, వివిధ సంక్షేమ పథకాలకు గత నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.20 కోట్ల మేర ఖర్చు చేసిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని కోరారు. నియోజకవర్గంలో రాజకీయాలు చేయటానికి తానిక్కడకు రాలేదన్నారు. అభివృద్ధి చేయటానికి మాత్రమే వచ్చానని చెప్పారు. ప్రజా సంక్షేమం కోరే ప్రభుత్వం కావాలా? లేక మోసపూరిత వాగ్దానాలు ఇచ్చే విపక్షాలు కావాలో తేల్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ దామోదరరావు, వివిధ శాఖల అధికారులు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ కేతా త్రిమూర్తులు ఎంపిటీసీ సభ్యులు గండేపల్లి రామకృష్ణ, వేంద్ర శ్రీను, సొసైటీ అధ్యక్షుడు రేలంగి ఏసు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నందిగం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆసుపత్రిలో అభివృద్ధి పనులు



కొవ్వూరులో దాత అల్లూరి ఇంద్రకుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు: పట్టణంలోని ప్రాంతీయ పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన పశువుల బోను, ఇన్ పేషెంట్ షెడ్డును అవంతీ ఫీడ్స్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ మంగళవారం ప్రారంభించారు. తమ సంస్థ తరపున విరాళంగా ఈ షెడ్డు, బోను నిర్మించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్న కుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎస్‌జీటీ సత్యగోవిందు, ఏడీ ఎ.వెంకటరెడ్డి, ఉప సంచాలకుడు జి.రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు పరిమి హరిచరణ్, పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రకుమార్‌ను ఘనంగా సత్కరించారు.

ప్రతి ఇంటికీ సమృద్ధిగా తాగు నీరిస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సూరాపురంలో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన



జల్‌జీవన్ మిషన్ పనుల శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సమృద్ధిగా తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.40 లక్షల వ్యయంతో మండలంలోని సూరాపురం గ్రామంలో నిర్మించే 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది సంక్రాంతి లోగా జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తిచేసి అన్ని గ్రామాల్లోనూ తాగునీటి కొరత సమస్య తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. సూరాపురంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల పంపిణీ సమస్యను పరిష్కరిస్తామని, రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీను, ఎంపీడీఓ పి.శామ్యూల్, పంచాయతీ కార్యదర్శి కేవీ సుబ్బన్న, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి భరోసా

గోపాలపురం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రకృతి వ్యవశాయ విభాగం జిల్లా అధికారి సి.పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని చిట్యాల గ్రామంలో తొమ్మిది రకాల సేంద్రియ పదార్థాల ద్వారా తయారు చేసిన ఎస్ టు ఎస్ కిట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ విత్తనం నాటి నప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకూ రసాయన ఎరువులు వాడకుండా ఎస్ టు ఎస్ కిట్ల ద్వారా పంటలు పండించ వచ్చన్నారు. చీడ పీడల నుంచి పంటలను కాపాడటానికి సేంద్రియ సిబ్బంది తయారు చేసిన కషాయాలను వినియోగించాలన్నారు. మండలంలోని చిట్యాల, వెంకటాయపాలెం, చెరకుమిల్లి గ్రామాల రైతులకు కిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దుర్గాదేవి, సత్యనారాయణ, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నదిలో దూకి వ్యక్తి అదృశ్యం ఘటనపై కేసు

కొవ్వూరు: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామానికి చెందిన గంగన శ్రీనివాస్ అనే వ్యక్తి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతడి మోటార్ సైకిల్, పాదరక్షలు గామన్ ఇండియా బ్రిడ్జిపై 56వ స్తంభం వద్ద సోమవారం రాత్రి లభ్యం కావడమే వారి అనుమానానికి కారణం. ఆ వస్తువులను పెట్రోలింగ్ పోలీసులు గుర్తించి కొవ్వూరు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీనివాస్ మానసిక స్థితి సక్రమంగా ఉండడం లేదని అతడి బావ మరిది ఉండవల్లి శ్రీహరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారని పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపారు. కాగా శ్రీనివాస్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

వార్డు సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ఘట్టం ప్రారంభం



కొవ్వూరు మండలం ఐ.పంగిడిలో నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి 7,9 వార్డులకు, కాటకోటేశ్వరం 1వ వార్డు ఉప ఎన్నికలకు మంగళవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించినట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ తెలిపారు. తొలి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. ఈనెల 10వ తేదీ లోగా నామినేషన్ల స్వీకరణ, 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోగా నామినేషన్ల విత్‌డ్రా చేసేందుకు వీలవుతుందని చెప్పారు. 19న ఎన్నిక నిర్వహించి, మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థిని ప్రకటించనున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

గోపాలపురం: మండల కేంద్రమైన గోపాలపురంలో ఖాళీగా ఉన్న రెండు వార్డు సభ్యుల ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పంచాయతీ పరిధిలోని 12,16వార్డు సభ్యుల ఎన్నికలకు ఈనెల 10వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరిస్తామన్నారు.

ఐ.పంగిడి ఎనిమిదో వార్డుకు రెండు

కొవ్వూరు: మండలంలోని ఐ.పంగిడి ఎనిమిదో వార్డు ఉప ఎన్నికకు తొలి రోజైన మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.జనసేన మద్దతుతో ఎనిమిదో వార్డుకు ముప్పిడి సూర్యకాంతం, కొప్పాక రోజారాణి నామినేషన్లు దాఖలు చేశారు.ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. మాజీ ఎంపీపీ పీకే రంగారావు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పెరుగు పోతురాజు, కొప్పాక విజయకుమార్, జనసేన మండల ప్రధాన కార్యదర్శి పెరుగు శివ, బొర్ల వెంకటేశ్వరరావు, మడిచర్ల నాగరాజు, వాసిరెడ్డి వెంకటేష్ పాల్గొన్నారు.

స్మోక్ ఫ్రీ జోన్‌గా శ్రీవారి క్షేత్రం



స్మోక్ ఫ్రీ జోన్ డిక్లరేషన్‌ను శ్రీవారి దేవస్థానం ఈఓ త్రినాథరావుకు అందిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

- ఈఓకు డిక్లరేషన్ సర్టిఫికెట్ అందించిన ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- బాధ్యత మరింత పెరిగిందన్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రానికి స్మోక్ ఫ్రీ జోన్‌గా గుర్తింపు లభించింది. సంబంధిత డిక్లరేషన్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావుకు, ఏలూరు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ మంగళవారం అందజేశారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా శ్రీవారి కొండపైన ద్వారకా అతిథి గృహంలో స్మోక్ ఫ్రీ జోన్ డిక్లరేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్‌టీసీపీ అధికారి డాక్టర్ పి.ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో తిరుమల తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా గుర్తించారన్నారు. అలాగే ద్వారకా తిరుమల క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా చేసేందుకు, ఆరు నెలలుగా ఈ క్షేత్రంలో ధూమపానం, మద్యపాన నిషేధం అమలుకు వీలుగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారన్నారు. దాంతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శ్రీవారి క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా ప్రకటిస్తూ డిక్లరేషన్ మీద సంతకం చేసి, సర్టిఫికెట్‌ను ఆలయ ఈఓకు అందజేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ దక్షిణ భారత దేశంలోని తిరుమల తిరుపతి, విజయవాడ, ద్వారకాతిరుమల, అలాగే ఉత్తర భారత దేశంలోని వైష్ణవీదేవి ఆలయాలను స్మోక్ ఫ్రీ జోన్‌లుగా గుర్తించారన్నారు. రాష్ట్ర స్మోక్ ఫ్రీ జోన్ లీగల్ అడ్వైజర్ పి.శివశంకర్ మాట్లాడుతూ భారత దేశంలో దేవాలయాల పరిసర ప్రాంతాల్లో పొగాకు అమ్మకాలు, ఉత్పత్తులను నిషేధించాలని ప్రభుత్వం చట్టాన్ని రూపొందించిందని, దాని ప్రకారం ద్వారకాతిరుమల క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా గుర్తించామన్నారు. దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ చిన్న తిరుపతి క్షేత్రానికి స్మోక్ ఫ్రీ జోన్ సర్టిఫికెట్ లభించడం హర్షణీయమన్నారు. ఇప్పటి నుంచి తమ బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్మోక్ ఫ్రీ జోన్ అడ్వైజర్ డాక్టర్ సౌజన్య లక్ష్మి, రాష్ట్ర ప్రోగాం అసిస్టెంట్ డాక్టర్ లక్ష్మీ సౌజన్య, జిల్లా ఇన్‌చార్జి డీఎం అండ్ హెచ్‌ఓ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి సీహెచ్ మానస, డీపీఎంఓ డాక్టర్ డి.జోషిరాయ్, ఎపిడెమియాలజిస్ట్ టీడీ ప్రియాంక, ఎఫ్ఎల్‌సీ సీహెచ్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



జెడ్పీ బాలికల హైస్కూల్లో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కౌన్సిలర్లు సుప్రియ, షకీరాబేగం

నిడదవోలు: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను మంగళవారం వారిద్దరూ పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్‌కు వెళ్లి పరిశీలించారు. మెనూ ప్రకారం రోజూ భోజనం తయారు చేస్తున్నారా? లేదా? అని విద్యార్థులను వారు అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్లు ఇద్దరు స్వయంగా భోజనాలు చేసి ఆహార పదార్థాల రుచిని పరిశీలించారు. అయితే జెడ్పీ హైస్కూల్‌లో అన్నం కొంచెం ముద్దగా ఉంటోందని విద్యార్థులు వారికి దృష్టికి తెచ్చారు. నాణ్యమైన బియ్యం అందించేలా ఎంఈవో, తహసీల్దార్ దృష్టికి తీసుకువెళతామని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సీహెచ్ పద్మ, యు.గురునాథం, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న మెగా లోక్ అదాలత్

నిడదవోలు: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తామని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తెలిపారు. ఈ ప్రత్యేక కోర్టును కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సివిల్, క్రిమినల్, రాజీపడిన, పెట్టీ కేసులను, పెండింగ్‌లో ఉన్న కేసులను, బ్యాంక్, ఎలక్ట్రికల్, బీఎస్ఎన్ఎల్, ప్రి లిటికేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

నేటి నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవ్

నిడదవోలు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 9 నుంచి 15 వరకూ నాభూమి- నాదేశం, నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ మంగళవారం తెలిపారు. నిడదవోలు మండలంలోని 22 గ్రామ సచివాలయాల్లో షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చాగల్లు: బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు డాక్టర్ నిశిత, వరలక్ష్మిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా గర్భిణులకు, చిన్నారులకు వ్యాక్సిన్ వేశారు.చాగల్లు ఆశోక్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, చాగల్లు పీహెచ్‌సీ వైద్యులు ఇ.తనూజ, కె.నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com